క్లుప్తంగా

మినీ గోకులాల నిర్మాణాలకు రాయితీ


అశోక్‌కుమార్, వెటర్నరీ డాక్టర్

హాలహర్వి: మండలంలోని గొర్రెలు, మేకలు, పశువులు, కోళ్ల పెంపకానికి మినీ గోకులాల షెడ్ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో విలేకరులతో మాట్లాడారు. గోకులాల నిర్మాణం కోసం ప్రభుత్వం 90 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక వెటర్నరీ ఆస్పత్రిని సంప్రదించాలన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

మద్దికెర: వేరుశనగ విత్తనం వేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని ఏఓ రవి సూచించారు. మంగళవారం మద్దికెర గ్రామ పరిసరాల్లో విత్తనశుద్ధిపై అన్నదాతలకు పలు సూచనలు చేశారు. కిలో విత్తనాలకు ఇమిడక్లోపిడ్ 2 ఎం.ఎల్, సాఫ్ 10 గ్రాములు, ట్రైకోడెర్మ విరిడి మందులతో విత్తనశుద్ధి చేయాలన్నారు. విత్తనశుద్ధి చేయడం ద్వారా పురుగు, వేరుకుళ్లు, కాండం కుళ్లు, తెగుళ్లు ఆశించకుండా ఉంటుందని తెలిపారు. మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. వ్యవసాయ సహాయకులు జాకీర్ హుస్సేన్, ఆనంద్ ఉన్నారు.

భవన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

మద్దికెర: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన భవన నిర్మాణ కార్మికులు నాగరాజు, వెంకటరాముడు కుటుంబాలకు మద్దికెర భవన కార్మికుల సంఘం సభ్యులు మంగళవారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. నాగరాజు కుటుంబానికి రూ.60 వేలు, వెంకటరాముడు కుటుంబానికి రూ.15 వేలు అందజేశారు. తోటి కార్మిక కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు


పాఠశాల వద్ద బ్లీచింగ్ పౌడర్ వేస్తున్న కార్మికుడు

వెల్దుర్తి(కృష్ణగిరి): గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని ఈఓఆర్‌డీ నరసింహులు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై మంగళవారం వెల్దుర్తి మండలం నర్సాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. పందుల సంచారంపై పలువురు ఫిర్యాదు చేశారు. పందులను ఊరికి దూరంగా ఉంచాలని యజమానులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

పర్యావరణాన్ని కాపాడుదాం


ఎల్లార్తి పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న హెచ్ఎం, విద్యార్థులు

హొళగుంద: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని హెచ్ఎం అశోక్‌కుమార్, గ్రామపెద్దలు లక్ష్మీకాంత్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎల్లార్తిలో నూతనంగా నిర్మిస్తున్న హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోవడం వల్ల మానవులతో పాటు జీవరాశుల మనుగడకు ముప్పు పొంచివుందన్నారు.

బెల్లం ఊట ధ్వంసం


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా కొండల్లో మంగళవారం హొళగుంద ఎస్ఐ పెద్దయ్యనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు నాటుసారా స్థావరాల పై దాడులు నిర్వహించారు. కొండల్లో ఉన్న నాటుసారా స్థావరాలను గుర్తించి సారా తయారీకి బిందెల్లో నిల్వ ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అలాగే 10 లీటర్ల నాటుసారా సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుకు భరోసా లభించేనా?

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలైనా కదలని యంత్రాంగం
- ఈ-క్రాప్ నమోదు ప్రారంభంకాని వైనం
- ఇప్పటికే 70 శాతం పంటల సాగు
- ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు
- ఆందోళనలో అన్నదాతలు


ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

ఆలూరు రూరల్: గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాలు అమలవుతాయో లేదోనని రైతన్నలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఆయా పథకాలపై కూటమి ప్రభుత్వం దాగుడుమూతలాడుతుండడంతో సందిగ్ధంలో పడ్డారు. గతేడాది ఈ పాటికే ఈ-క్రాప్ నమోదు పూర్తి కాగా, ప్రస్తుతం 70 శాతం పంటలు సాగు కాగా ఇప్పటి వరకూ ఈ పంటనమోదు చేపట్టకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

82 వేల హెక్టార్లలో పంటల సాగు..

ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గతేడాది ఖరీఫ్ సీజన్‌లో 62 వేల హెక్టార్లలో ఈ-క్రాప్ నమోదు చేశారు. రబీ సీజన్‌లో 80 వేల హెక్టార్లకు పైగా ఈ-క్రాప్ నమోదు జరిగింది. ఖరీఫ్‌లో ఈ ఏడాది 82 వేల హెక్టార్లలో పంటల సాగు లక్ష్యంగా వ్యవసాయ అధికారులు ప్రణాళిక సిద్ధం చేయగా ఇప్పటి వరకు 70 శాతం పంటలు సాగయ్యాయి. విత్తు నుంచి పంట కోత, అమ్మకం వరకు అండగా ఉండే ఈ-క్రాప్ విధానం అమలు చేయకపోతే భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అండగా ఉండేందుకు, అర్హులైన రైతులకు అన్ని విధాలా మేలు చేసేందుకు ఈ- క్రాప్ విధానం తోడ్పాటు అందిస్తుంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇలా..

ప్రభుత్వం మంజూరు చేసే ప్రతి రూపాయి గ్రామ స్థాయిలో రైతులకు అందజేయాలన్న ఆశయంతో 2019 రబీ సీజన్‌లో ప్రతిష్టాత్మకంగా ఈ-క్రాప్ నమోదు విధానాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం (ఆర్బీ అండ్ యూడీపీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన పంటలను ఆర్బీకేల ద్వారా నమోదు చేయడం వల్ల పారదర్శకత ఉండేది. రెవెన్యూ వెబ్‌ల్యాండ్ డేటాను అనుసరించి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అంశాల ఆధారంగా ఆర్బీకే వ్యవసాయ సహాయకులు ఈ-క్రాప్ విధానంలో పంట నమోదు చేసేవారు. ఈ- క్రాప్ ఉండడంతో రైతు సాగు చేసే పంట వివరాలు వ్యవసాయ శాఖ వద్ద అందుబాటులో ఉండేవి. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న వెంటనే సంబంధిత రైతు వివరాలన్నీ ఆర్బీకేలలో ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్‌లలో నిక్షిప్తమయ్యేవి. సమయానికి ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు రాయితీపై లభించేవి. రైతులకు ప్రభుత్వమే బీమా సొమ్ము చెల్లించి ఉచితంగా పంటల బీమా చేయించడంతో రైతులు సాగుపట్ల ధీమాగా ఉండేవారు. ఈ-క్రాప్ విధానంలో నమోదైన భూమిని బట్టి ఇన్‌పుట్ సబ్సిడీని త్వరిగతిన మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి వీలు కలిగేది. రైతులు పండించిన పంటలను ఎప్పుడైనా తనకు నచ్చిన రీతిలో గిట్టుబాటు ధరకు విక్రయించే అవకాశం లభించేది.


ఆలూరు సమీపంలో సాగు చేసిన కంది పంట

అమలు చేయకపోతే అన్నదాతకు నష్టం

ఈ-క్రాప్ నమోదు చేపట్టకపోతే రైతులు సాగు చేసే పంటలు, కౌలు రైతుల వివరాలు, సర్వే నంబర్ల వివరాలు వ్యవసాయ శాఖ వద్ద సమగ్రంగా ఉండే అవకాశం లేదు. పంటల సాగు వివరాలు తెలియకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వడానికి ఆస్కారం లేకుండా పోతుంది. రాయితీపై విత్తనాలు, ఉచిత పంట బీమా, సున్నా వడ్డీ రాయితీ పొందే హక్కు రైతులు కోల్పోయే ప్రమాదముంది. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, గిట్టుబాటు ధరలను కోల్పోయే పరిస్థితులు ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతింటే పరిహారం కోల్పోతారు. అంతేకాకుండా అనర్హులకు ప్రభుత్వ రాయితీ దక్కే ప్రమాదం ఉంది.

తీవ్రంగా నష్టపోతాం



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు విధానం అమలు చేయకపోతే రైతు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర పొందే అవకాశం కోల్పోతాం. రాయితీలు, పంట నష్టపరిహారం అందే పరిస్థితి ఉండదు. ప్రభుత్వం ఈ-క్రాప్ విధానాన్ని కొనసాగించి రైతులను ఆదుకోవాలి.

– తిక్కన్న రైతు, మొలగవల్లి గ్రామం

పంట వేసిన తరువాతే ఈ-క్రాప్ నమోదు



రైతులు పంట సాగు చేసిన తరువాతే పంట నమోదు చేస్తాం. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ విధానం అమలుపై ప్రభుత్వ పరంగా ఏ విధమైన ఆదేశాలు అందలేదు. వారం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన అనంతరం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తాం.

– సునీత, ఏడీఏ, ఆలూరు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ చేపట్టినట్లు ఏపీడీ పక్కీరప్ప తెలిపారు. ఉపాధి హామీ కూలీల వేతనాలు, హార్టికల్చర్, గృహ నిర్మాణాలకు సంబంధించిన ఖర్చు, నిధులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీలు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కృష్ణమూర్తి, సర్పంచ్ కాసీం బీ, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులు సీసీఆర్సీ పొందేలా చూడండి

హొళగుంద: ప్రతి కౌలురైతు సాగుదారు హక్కు అర్హత కార్డు (సీసీఆర్సీ)ను పొందేలా చూడాలని ఏఓ ఆనంద్ లోకదళ్ సూచించారు. దీనివల్ల ప్రతి రైతుకు బ్యాంక్ రుణాలు, ఇతర రాయితీ పథకాల లబ్ధి పొందుతారన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ నిజాముద్దీన్‌తో కలిసి వీఆర్‌ఓలు, వీఏఏలు, వీహెచ్‌ఏలతో సమావేశం నిర్వహించారు. మండలంలో 1,360 సీసీఆర్సీ కార్డులు చెయాల్సిన లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు 410 కార్డులు మాత్రమే రైతులకు ఇచ్చామని, మిగిలిన టార్గెట్‌ను పూర్తి చెయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓ విరూపాక్షి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

చిప్పగిరి: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈఓపీఆర్డీ బాలన్న అన్నారు. మంగళవారం మండలంలోని డేగులపాడు గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. గ్రామంలో చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహులు, వీఆర్‌ఓ చంద్ర నాయక్ పాల్గొన్నారు.


తోలుబొమ్మను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయుడు తిప్పేస్వామి, హెచ్ఎం

విద్యార్థుల్లో విజ్ఞానం వికసించేలా..

తుగ్గలి: నూతన జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. రెండో రోజు మంగళవారం పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి భాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం దోహద పడుతుందని ఉపాధ్యాయులు అన్నారు. గణితంలోని సంఖ్యాశాస్త్రం ద్వారా నైపుణ్యాల అభివృద్ధిని వివరించారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు


మనగ్రోమోర్‌లో తనిఖీ చేస్తున్న ఏఓ సురేష్‌బాబు

దేవనకొండ: పురుగు మందులు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి సురేష్‌బాబు హెచ్చరించారు. మండలంలోని మన గ్రోమోర్ సెంటర్‌ను మంగళవారం తనిఖీ చేశారు. రైతులు ఎరువులు కావాలంటే బయో మందులు కొనాలని ఒత్తిడి చేయరాదని, ఎవరైనా తమకు ఫిర్యాదు చేస్తే షాపుల యజమానులపై చర్య లు తీసుకుంటామన్నారు. పంట వయస్సును బట్టి తగిన మోతాదులోనే ఎరువులు వాడాలని, అధిక ఎరువులు వాడితే వర్షాభావ పరిస్థితుల్లో బెట్టకు వచ్చే అవకాశం ఉందన్నారు.

అందరూ చూస్తున్నారు.. అయినా పట్టించుకోరు


ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

ఆలూరు: పట్టణంలో నడి రోడ్డుపై జామీయా మసీదు ఎదురుగా రోడ్డు డివైడర్‌పై విరిగి విరిగి పడిన ఐరన్ విద్యుత్ స్తంభం ప్రమాద కరంగా మారింది. స్తంభం పడిపోయిన విషయాన్ని ముస్లిం పెద్దలు గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా ఏ శాఖ అధికారులు స్పందించలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారు. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయంపై ఆలూరు విద్యుత్ ఏఈ గుర్రప్పను విచారించగా గ్రామపంచాయతీ, విద్యుత్ సిబ్బందికి తెలియజేశానని చెప్పారు.

బాలుడి చికిత్సకు ఆర్థిక సాయం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడుని పరామర్శిస్తున్న సుధాకర్ గౌడ్

వెల్దుర్తి (కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణానికి చెందిన హమాలి శ్రీను, మమత దంపతుల కుమారుడు నిషాంత్(14 నెలలు) సోమవారం రాత్రి 11గంటల సమయంలో మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతూ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. తల్లిదండ్రులు అదే వీధిలో ఉంటున్నసుధాకర్ గౌడ్‌కు విషయం చెప్పారు. స్పందించిన ఆయన బాలుడిని తన వాహనంలో కర్నూలు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రూ.25 వేల ఆర్థిక సాయం చేశారు. బాలుడి చికిత్సకు అయ్యే ఖర్చును తాను, మిత్రులు, నాయకుల సహాయంతో సమకూర్చనని సుధాకర్ గౌడ్ చెప్పడంతో బాలుడి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి


మందులు పంపిణీ చేస్తున్న ఏడీ

మద్దికెర: గ్రామాల్లో నిర్వహించే పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీ రవిప్రకాష్‌రెడ్డి, పశు వైద్యాధికారి కృష్ణానాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేశారు. పాడి రైతులకు మినరల్ మిక్చర్, ఎదకు వచ్చే మందులు అందజేశారు. దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. శిబిరంలో 62 ఆవులు, ఎనుములకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో హోసూరు, ముక్కెళ్ల గ్రామాల పశు వైద్యులు లక్ష్మన్న, వెంకటేశులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి


సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏడీఏ విజయ్ మోహన్‌కుమార్

కృష్ణగిరి: ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు జరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయ సిబ్బంది అన్నదాతలకు అందుబాటులో ఉంటూ తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని పత్తికొండ ఏడీఏ విజయ్ మోహన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఏఓ వెంకటేశ్వర్లుతో కలిసి సిబ్బందితో మాట్లాడారు. మండలంలో ఎలాంటి రకాల పంటలు సాగు చేశారు? ఎంత విస్తీర్ణంతో సాగు చేశారు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా గ్రామ స్థాయిలో ఉండే అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్‌లు ఆయా గ్రామాల్లోని రైతులతో నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే పంట నమోదుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఏఈఓలు రాజేష్, అనిల్ కుమార్ ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ వేయిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

ఆస్పరి: ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని జొహరాపురం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వీధులలో వర్షపు నిల్వ ఉన్న చోట దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ వేయించాలని, మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్‌కు సూచించారు. మంచీ నీటి కుళాయిలు మురుగు కాలువల్లో ఉంటే మార్చాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట సర్పంచ్ నెల్లూరప్ప, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆస్పరి: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రఘురామిరెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్‌గా అతిసారా, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. రైతులు పొలాల్లో ఎక్కడ బడితే అక్కడ నిలువ ఉన్న నీటి తాగరాదన్నారు. గ్రామాలలో ఏఎన్ఎంల ద్వారా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

26న వాహనాల బహిరంగ వేలం

పత్తికొండ రూరల్: మద్యం, నాటుసారా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను ఈనెల 26వ తేదీ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ స్వర్ణలత తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు కార్యాలయంలో రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. వేలంలో వాహనాలు దక్కించుకోలేకపోతే డిపాజిట్ నగదును తిరిగి చెల్లిస్తామని పేర్కొన్నారు.

వేధింపుల కేసు నమోదు

పత్తికొండ రూరల్: పత్తికొండకు చెందిన రాంపల్లి రామాంజనేయులు తనను వేధిస్తున్నాడని మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు మేరకు మంగళవారం వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీమోహన్ తెలిపారు. ఈమె భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందగా రామాంజనేయులు ఆమెతో చనువుగా ఉంటూ దగ్గరయ్యాడు. నిత్యం డబ్బులు కావాలని బెదిరిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే చర్యలు

నందవరం : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, పరిశుభ్రతపై సచివాలయ సిబ్బంది, గ్రామాధికారులు, హెల్త్ సిబ్బంది అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఓబులేసు హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో ఎక్కడి చెత్త అక్కేడి ఉందని పారిశుద్ధ్య పనులు చేపట్టాలేదని సచివాలయ కార్యదర్శి, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, గ్రామాల్లో పరిశుభ్రత చర్యలు చేపట్టలేదని, పనుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ జెర్మియా, సచివాలయ కార్యదర్శి హసీనా తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించండి

దేవనకొండ: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూపర్‌వైజర్లు రంగస్వామి, జయలక్ష్మి, శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలోని ల్యాబ్, ఆరోగ్య కార్తకర్తల రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఎన్ఎంలకు సీజనల్ వ్యాధులు, డయేరియా పట్ల అవగాహన కల్పించారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని తుంగభద్ర రైల్వే స్టేషన్ సమీపంలో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుంగభద్ర రైల్వే స్టేషన్ సమీపంలో బోయ నాగరాజు, బోయ బసవరాజు అనే ఇద్దరు వ్యక్తులు మట్కా చీటీలు రాస్తుండగా వారిని పట్టుకున్నట్లు చెప్పారు. ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6,280లు నగదును స్వాధీనం చేసుకొని మాధవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

కన్నడ పండితుడి కళానైపుణ్యం

హొళగుంద: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధి, బోధన అంశాలకు సంబంధించి కన్నడ పండితుడు ఆర్ తిప్పేస్వామి మంగళవారం చిత్రకళలు, తోలుబొమ్మలను తయారు చేసి ప్రదర్శించారు. ఈయనకు చిత్రలేఖనం, శిల్పాల తయారీలో నైపుణ్యం ఉంది. కర్ణాటకలో పలు అవార్డులు కూడా అందుకున్నారు. హెచ్ఎం నజీర్ అహ్మద్ ఆయన ప్రతిభను మెచ్చుకుని అభినందించారు.


పెండేకల్లు జెడ్పీహెచ్ఎస్‌లో శిక్షా సప్తాహ్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

సమస్యల మండల కేంద్రం


సచివాలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త


మెయిన్ రోడ్డులో కుంగిన సీసీరోడ్డు

తుగ్గలి: మండల కేంద్రం తుగ్గలిలోని సచివాలయం, రైల్వే బ్రిడ్జి పరిసరాలు చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో అధ్వానంగా మారాయి. ఇక మెయిన్ రోడ్డులో సీసీరోడ్డు చీలికలతో కుంగిపోవడం, రైల్వే బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డులో మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఒక్కోసారి బ్రిడ్జిలో వాహనాలు ఇరుక్కుపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గుత్తి–ఆదోని–మంత్రాలయం ప్రధాన రహదారి కావడంతో ఇటీవల ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువైంది. అధికారులు, పాలకులు తిరిగే ప్రాంతాల్లోనే చెత్తాచెదారం పేరుకుపోవడం, రోడ్డు అధ్వానంగా తయారవడం చూసిన జనం ఇదీ ఒక మండల కేంద్రమేనా అని ముక్కున వేలేసుకుంటున్నారు. అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, అభివృద్ధిపై పాలకులు, అధికారులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే తప్ప వారు పట్టించుకోరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దయనీయ పరిస్థితిని గుర్తించి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


రైల్వే బ్రిడ్జిలో ఇరుక్కుపోయిన లారీ(ఫైల్)

విభిన్న ప్రతిభావంతుల వివరాల సేకరణ


సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న డీడీఆర్‌సీ వైద్య సిబ్బంది

వెల్దుర్తి(కృష్ణగిరి): వినికిడి యంత్రం, ట్రై సైకిల్, బ్యాటరీ బైక్, కళ్లద్దాలు ఇతరత్రా సౌకర్యాల కల్పన కోసం కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ పరిధిలోని కర్నూలు జిల్లా విభిన్న ప్రతిభావంతుల(వికలాంగుల) పునరావాస కేంద్రం (డీడీఆర్‌సీ–డిస్ట్రిక్ట్ డిజేబిలిటీ రీహాబిలిటేషన్ సెంటర్), ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా మంగళవారం వెల్దుర్తి పట్టణంలోని విభిన్న ప్రతిభావంతుల సర్వే నిర్వహించాయి. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో పునరావాస కేంద్రం వైద్యులు గంగా భవాని, సాయి పూజిత రెడ్డి, కె.మద్దిలేటి, దావీదు 98 మంది విభిన్న ప్రతిభావంతుల సదరన్ సర్టిఫికెట్లు, వారి వైకల్య తీవ్రతను పరిశీలించారు. సౌకర్యాల కల్పనపై వివరాలు సేకరించారు. అనంతరం స్థానిక ఎంపీపీ స్కూల్ భవనంలో నిర్వహిస్తున్న విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో విద్యార్థులను పరిశీలించారు. అవసరమైన సామగ్రి అందించేలా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఎంపీడీఓ శివశంకరప్ప పర్యవేక్షించారు.

భవిత పాఠశాల మరుగుదొడ్ల తలుపులు ధ్వంసం


ధ్వంసం చేసిన మరుగుదొడ్ల తలుపులు

ఆలూరు: మండల కేంద్రంలోని భవిత ప్రతిభ పాఠశాలలో (ప్రత్యేక అవసరాలుగల పిల్లల పాఠశాల)లో మరుగుదొడ్ల తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో టాయిలెట్లకు వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో చదువుతున్న వారందరూ బుద్ధిమాంద్యం గల విద్యార్థులని, దాతలు ముందుకొచ్చి మరుగుదొడ్ల తలుపులకు మరమ్మతులు చేయించాలని పాఠశాల ఉపాధ్యాయుడు రామదాస్ కోరారు.